ప్రజల చేతిలో

# ఆయుధం

www.ayudamdaily.com

The Common People's Voice

బుధవారం | జూలై 01, 2026 | సంపుటి : 7 | సంచిక : 29 | పేజీలు : 2

## సీఎం రేవంత్ ను కలిసిన
# నూతన సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, ఆయుధం:**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ని తెలంగాణ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంజయ్ జాజు ఎంసీఆర్ హెచ్ఆర్డీ లోని బోధి పెవిలియన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రధాన కార్యదర్శి, సలహదారు, సీఎం ఎక్స్అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా నియమితులైన కె. రామకృష్ణా రావు కూడా ఉన్నారు





## బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్..
# ఆ బద్నాం మోసింది నేను

### కాళేశ్వరం కూలినా.. వరి సాగులో తెలంగాణ నంబర్ వన్

- కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీ పూర్తిచేశారా?
- పశుపతిని బంధించాం.. ఇక బయటకు రానివ్వం
- రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:**

''బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్.. ఆ బద్నాం మోసింది నేను. కేసీఆర్ చేసిన అప్పులతో దిల్లీలో కూడా పరువు పోయే పరిస్థితి వచ్చింది'' అని రేవంత్ రెడ్డి అన్నారు. రూ.వేలకోట్ల కమీషన్ల కోసం బీఆర్ఎస్ హయాంలో హడావుడిగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలినా.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బోరు కింద పంటలు పండినా కాళేశ్వరం మహిమ అంటూ ప్రజలను మోసం చేశారని చెప్పారు. అరుంధతి సినిమాలో పశుపతిని బంధించినట్టు ఇక్కడ కూడా పశుపతిని బంధించామని.. ఇక బయటకు రానిచ్చేది లేదని రేవంత్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో నిర్వహించిన సభలో రైతు భరోసా నిధుల పంపిణీని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

**ఒక్కసారైనా రైతు రుణమాఫీ పూర్తిచేశారా?**

''కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా?దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు?పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి తాగుడు కల్చర్ నేర్పించారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే చేసేదేమీ ఉండదు. వరి వేస్తే ఉరే అని బెదిరించి రైతుల పంటను కొనలేదు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని భార్యాభర్తలు మాట్లాడుకునే ఫోన్లు విన్నారు. దొంగచాటుగా తన ఫోన్లు విన్నారని స్వయంగా కేసీఆర్ కుమార్తె చెప్పారు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ అన్నారు.. వేశారా?ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఆయన చెప్పారు.. ఇచ్చారా?పశ్చిమ బెంగాల్‌లో ఉడికిన పప్పులు తెలంగాణలో ఉడకవు. అక్కడ గెలిచేందుకు భాజపాకు 15 ఏళ్లు పట్టింది. తెలంగాణలోనూ ఆ పార్టీ గెలవాలంటే మరో 15 ఏళ్లు పడుతుంది. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం. మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. మహిళలతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి యజమానులుగా చేశాం. రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం.

**బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్..**

**ఆ బద్నాం మోసింది నేను**

ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షాలు పడ్డాయి. రైతుల వరిసాగు తగ్గించి మెట్ట పంటలు వేసుకోవాలి. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనుకునేలా చేస్తున్నాం. 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9వేల కోట్లు వేస్తాం. ఒక్కో సమస్యను చక్కబెట్టుకుంటూ సంక్షేమం కొనసాగిస్తున్నాం. సాగు పనులు మొదలయ్యే నాటికే రైతుభరోసా అందిస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రాన్ని 19 మంది ముఖ్యమంత్రులు పాలించారు. వారు చేసిన అప్పు రూ.60వేల కోట్లు మాత్రమే. తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అప్పు రూ.8.11లక్షల కోట్లు. అప్పుల ఊబిలో మునిగిన రాష్ట్రాన్ని నాకు అప్పగించారు. 2023లో సీఎస్ వంటి ఐఏఎస్ అధికారులకే 1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి. కొన్నేళ్లుగా వాయిదాల పద్ధతిలో వస్తున్నాయని అధికారులు చెప్పారు. బడి పిల్లల తిండి బిల్లులు కూడా రూ.వేల కోట్ల బకాయిలు పెట్టారు. సర్పంచ్‌ల బిల్లులు రూ.వేలకోట్లు పెండింగ్ పెడితే.. వారు ఇప్పుడు ధర్నాలు చేశారు. బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్.. ఆ బద్నాం మోసింది నేను. కేసీఆర్ చేసిన అప్పులతో దిల్లీలో కూడా పరువు పోయే పరిస్థితి వచ్చింది'' అని రేవంత్ అన్నారు.

## సీఎస్సార్ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం

**హైదరాబాద్, ఆయుధం:**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్) నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ సమకూర్చిన రెండు అంబులెన్స్‌లకు ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఎంఆర్ఐ స్కానర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల నుంచి రుణాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని పేర్కొంటూ మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలతో లాజిస్టిక్ పార్కులు, గోడౌన్లు, రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నామని, అందుకోసం పెద్ద ఎత్తున రుణాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





## విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**విశాఖపట్నం, ఆయుధం:** విశాఖలోని నోవాటెల్‌లో నిర్వహించిన కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ప్రథమ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరయ్యారు. మొత్తం 373 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు రాష్ట్రపతి బంగారు పతకాలు బహూకరించారు. గిరిజన వర్సిటీ.. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించే కేంద్రంగా నిలుస్తోందని ఆమె అన్నారు. విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేశ్, అనిత పాల్గొన్నారు.

## విజయ సంకల్ప సమ్మేళనం
# విజయవంతం

- సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్







## పారిశుద్ధ్య నిర్వహణలో జవాబుదారీతనం
# పెరగాలి

- కమర్షియల్ సంస్థల్లో తప్పనిసరిగా రెండు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలి
- విధులకు దీర్ఘకాలంగా గైర్హాజరవుతున్న సిబ్బందిని గుర్తించి చర్యలు చేపట్టాలి
- 34వ డివిజన్ శివనగర్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్ టి. వెంకన్న




## నేరం చేస్తే శిక్ష పడుతుందని నిందితుల్లో భయం కలగాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

నేరం చేస్తే కోర్టులో శిక్ష పడుతుందని భయాన్ని నిందితులను కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలియజేశారు. కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితులు పాల్పడిన నేరాలను కోర్టు నిరూపించి నేరస్థులకు శిక్ష పడటంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పాటు దర్యాప్తు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ ప్రశంస పత్రాలను అందజేసారు.

## పదవీ విరమణ అనంతరం
# ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**హనుమకొండ, ఆయుధం:** పదవీ విరమణ అనంతరం పోలీస్ అధికారులు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులను సీపీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమములో వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు బాధ్యతయుతమైన విధులు నిర్వర్తించడంతో పాటు నేటి తరం పోలీసులు అదర్శంగా నిలుస్తున్నారని, పదవీ కాలంలో శాంతి భద్రతల పరిరక్షణకై నిత్యం విధులకు అంకితమైన పోలీస్ అధికారులు ఇకపై తమ కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయాన్ని గడపాలని, భవిష్యత్తులో సేవ కార్యక్రమాల్లో పాల్గోనాలని సిపి తెలిపారు. పదవీ విరమణ పోందిన వారిలో అడిషినల్ డిసిపి రవి, ఎస్.ఐలు విజయ్‌కుమార్, రాజయ్య, రవీందర్ రెడ్డి, విజయ్‌కుమార్, జనార్ధన్, ఆమరేందర్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, సంపత్, రమేష్, ఏ.ఎస్.ఐలు రమేష్, రాంధన్, బుచ్చయ్య, నర్సింగ రావు, సత్తయ్య, హెడ్ కానిస్టేబుల్లు రవికుమార్, ప్రభాకర్, కుమారస్వామి, సత్యదేవ్, కానిస్టేబుళ్ళు గ్యామ, సుధాకర్, సలావుద్దీన్ వున్నారు. కార్యక్రములో అదనపు డిసిపిలు సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఏసిపిలు అంతయ్య, సురేంద్ర, ఆర్.ఐలు సతీష్, స్పర్జన్ రాజ్, హన్మకొండ ఇన్స్‌స్పెక్టర్ శివకుమార్, ఆర్.ఎస్.ఐ శ్రావణ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



# నేటి నిర్మాణ వ్యర్థాలే రేపటి విలువైన వనరులు

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఆస్కీ సెంటర్ డైరెక్టర్ డా. బి.జనార్ధన్ రెడ్డి
- జీడబ్ల్యూఎంసీ–ఆస్కీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అవగాహన

**హనుమకొండ, ఆయుధం:** నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా శాస్త్రీయంగా నిర్వహిస్తే అవే రేపటి విలువైన వనరులుగా మారుతాయని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కీ) సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి. జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ), ఆస్కీ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులకు ఒకరోజు నాయకత్వ అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, నిర్మాణ వ్యర్థాలను చెరువులు, కుంటలు, రహదారుల పక్కన లేదా ఖాళీ స్థలాల్లో పారవేయడం వల్ల పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. వాటిని శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, వర్గీకరించి, ప్రాసెసింగ్ చేసి పునర్వినియోగంలోకి తీసుకురావడం ద్వారా సహజ వనరులను సంరక్షించడంతో పాటు నిర్మాణ వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని తెలిపారు. కాంక్రీట్, ఇటుకలు, రాళ్లు, ఇసుక వంటి నిర్మాణ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి పేవర్ బ్లాకులు, కర్బ్ స్టోన్లు, రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల్లో వినియోగించవచ్చని వివరించారు. అధికారులు సమస్యలు వచ్చిన తర్వాత స్పందించే విధానానికి బదులుగా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.

ఆస్కీ ఆధ్వర్యంలో నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణపై దేశంలోనే తొలిసారిగా వరంగల్‌లో సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలకు శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, నగరాల్లో నిర్మాణ కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో సీ అండ్ డీ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ అత్యవసరమని అన్నారు. నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా సేకరణ, రవాణా, రీసైక్లింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.



**7 ఎకరాల విస్తీర్ణంలో సీ అండ్ డీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్**

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ, గ్రేటర్ వరంగల్‌లో నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణ కోసం సుమారు ఏడు ఎకరాల విస్తీర్ణంలో రూ.8.70 కోట్ల వ్యయంతో సీ అండ్ డీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో విజయవంతంగా పనిచేస్తున్న సీ అండ్ డీ ప్లాంట్ల తరహాలో వరంగల్‌లోనూ ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు అమలులో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితర శాఖలను ప్రారంభం నుంచే భాగస్వాములను చేశామని పేర్కొన్నారు. ఈ శిక్షణలో పొందిన అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేసి నిర్మాణ వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్కీ ప్రతినిధులు కోటేశ్వరరావు, శ్యామ్ రాథోడ్, రాష్ట్రంలోని 15 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇంజినీర్లు, అధికారులు, పాల్గొన్నారు.




## వీధి వ్యాపారుల ఆర్థిక స్వావలంబనే
# ప్రభుత్వ లక్ష్యం

- స్వానిధి మహోత్సవ్–2026లో పాల్గొన్న కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్



# వీధి వ్యాపారుల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

- **స్వానిధి మహోత్సవ్–2026లో పాల్గొన్న కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ, ఆయుధం:** వీధి వ్యాపారుల ఆర్థిక స్వావలంబన, జీవనోపాధి భద్రత, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్లో నిర్వహించిన స్వానిధి మహోత్సవ్-2026 కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వీధి వ్యాపారుల ఆర్థిక ప్రగతి, స్వయం ఉపాధి బలోపేతం, కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుదలే స్వానిధి మహోత్సవ్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన వీధి వ్యాపారి సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో వీధి వ్యాపారులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీల సౌకర్యాలు, ఇతర సంక్షేమ పథకాలన్నింటినీ ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది వీధి వ్యాపారులు పాల్గొన్నారని చెప్పారు. పీఎం స్వనిధి పథకం కింద మొదటి, రెండో, మూడో విడత రుణాలను పెద్దఎత్తున అందిస్తున్నామని తెలిపారు. పీఎం స్వానిధి పథకం అమలులో గ్రేటర్ వరంగల్ మూడు విడతలలో రుణాల మంజూరులో దేశంలోనే మొదటి స్థానాన్ని సాధించడం విశేష విజయమని పేర్కొన్నారు. పథకంలో నమోదు కాని అర్హులైన వీధి వ్యాపారులకు ఈ మేళా ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు క్యూఆర్ కోడ్ సదుపాయం, బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక సలహాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. వీధి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి అవసరమైన ఆర్థిక, సాంకేతిక, డిజిటల్ సేవలను చేరువ చేయడం ద్వారా స్వయం ఉపాధిని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 48 వేల మంది స్ట్రీట్ వెండర్లు నమోదయ్యారని, కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారికి ఎప్పటికప్పుడు నమోదు అవకాశం కల్పిస్తూ, జాబితాను నిరంతరం నవీకరించాలని అధికారులకు సూచించారు. పీఎం స్వనిధి పథకం జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని, మొదటి విడతలో 30 వేల మందికి పైగా, రెండో విడతలో 20 వేల మందికి పైగా, మూడో విడతలో 10-11 వేల మందికి పైగా వీధి వ్యాపారులు రుణాలు పొందారని తెలిపారు. ప్రస్తుతం క్రెడిట్ కార్డుల ద్వారా రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు రుణ సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు. కామన్ ఇంటరెస్ట్ గ్రూప్ (CIG)*ల ఏర్పాటుతో వీధి వ్యాపారులు బ్యాంకుల నుంచి దశలవారీగా రూ.75 వేల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు పొందే అవకాశం ఉందని, ఈ విధానం వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వర్, ఉప కమిషనర్ సమ్మయ్య, ఎల్ డిఎం మహేందర్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నవీన్ కుమార్, డిఎంసి రజిత రాణి, టిఎంసిలు రమేష్ సంబంధిత అధికారులు, వీధి వ్యాపారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యత, జవాబుదారీతనం పెరగాలి

- **కమర్షియల్ సంస్థల్లో తప్పనిసరిగా రెండు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలి**
- **విధులకు దీర్ఘకాలంగా గైర్హాజరవుతున్న సిబ్బందిని గుర్తించి చర్యలు చేపట్టాలి**
- **34వ డివిజన్ శివనగర్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్ టి. వెంకన్న**



**వరంగల్, ఆయుధం:** నగర పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యత పెంపు, సమర్థవంతమైన సేవల అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని 34వ డివిజన్ పరిధిలోని శివనగర్, తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించిన కమిషనర్ పారిశుద్ధ్య నిర్వహణ, వీధుల పరిశుభ్రత, చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక వార్డు కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా రోజువారీ సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. చెత్త సేకరణలో స్పష్టమైన పురోగతి కనిపించేలా కార్యాచరణ రూపొందించాలని, చెత్త సేకరణ వాహనాలకు సంబంధించిన సాంకేతిక సమస్యలను వెంటనే గుర్తించి శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు.

నగరంలోని అన్ని కమర్షియల్ దుకాణాలు తప్పనిసరిగా రెండు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని, ఇంకా ఏర్పాటు చేయని వ్యాపార సంస్థలు వారం రోజుల్లోగా వాటిని ఏర్పాటు చేసేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గృహాల నుంచి చెత్త సేకరణ కోసం నాలుగు రకాల వ్యర్థాల వర్గీకరణకు అనుగుణంగా డస్ట్‌బిన్‌ల వినియోగాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 5.20 గంటలలోపు హాజరు నమోదు పూర్తి కావాలని, విధులకు సుదీర్ఘకాలంగా హాజరుకాని సిబ్బంది వివరాలను సేకరించి ప్రత్యేక జాబితా రూపొందించాలని ఆదేశించారు. తరచూ గైర్హాజరవుతున్న వారిని గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై కూడా కమిషనర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఉద్యోగుల ఈపీఎఫ్ (EPF) చందాలు క్రమం తప్పకుండా వారి ఖాతాల్లో జమ అవుతున్నాయా, ఇందుకు అమలులో ఉన్న విధానం ఏమిటనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి వార్డులో స్వచ్ఛ ఆటోల నిర్వహణ, చెత్త సేకరణ విధానం, డ్రైనేజీ శుభ్రత కార్యక్రమాల అమలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. శానిటేషన్ నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన నగర నిర్మాణమే జీడబ్ల్యూఎంసీ లక్ష్యమని పేర్కొన్న కమిషనర్, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్లు భాస్కర్, గోల్కొండ శ్రీను, ఇతర అధికారులు, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

# విజయ సంకల్ప సమ్మేళనం విజయవంతం

- **సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు**
- **బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్**



**వరంగల్, ఆయుధం:** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ సమక్షంలో వరంగల్ జిల్లా బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం అపూర్వ విజయాన్ని సాధించడం పట్ల బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మహాసమ్మేళనం విజయవంతం కావడం వెనుక వేలాది మంది బీజేపీ కార్యకర్తల అంకితభావం, క్రమశిక్షణ, సమష్టి కృషి దాగి ఉందన్నారు. కార్యక్రమం నిర్వహణలో సహకరించిన జిల్లా పదాధికారులు, రాష్ట్ర నాయకులు, మండల అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, మోర్చాల నాయకులు, మహిళా కార్యకర్తలు, యువ మోర్చా, సోషల్ మీడియా బృందం, మీడియా సమన్వయ కమిటీ, వేదిక, ప్రచారం, రవాణా, పార్కింగ్, భోజన, వసతి, భద్రత, స్వచ్ఛంద సేవల బాధ్యతలు చేపట్టిన ప్రతి కార్యకర్తకు ఆయన పేరు పేరునా అభినందనలు తెలియజేశారు.

జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త తన బాధ్యతను కుటుంబ సభ్యుడిలా భావించి నిర్వర్తించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమం కోసం ఎన్నో రోజులుగా శ్రమించి, రాత్రింబవళ్లు కష్టపడిన ప్రతి ఒక్కరి శ్రమకు పార్టీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. "వరంగల్ గడ్డపై కాషాయ జెండా మరింత ఎత్తున ఎగరాలని, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సంకల్పంతో ప్రతి కార్యకర్త అహర్నిశలు శ్రమించారు. ఈ విజయ సంకల్ప సమ్మేళనం కేవలం ఒక సమావేశం కాదు... వరంగల్ జిల్లాలో బీజేపీ బలం, కార్యకర్తల ఐక్యత, ప్రజల విశ్వాసానికి ప్రతీక. ఈ విజయానికి కారణమైన ప్రతి కార్యకర్తకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ కష్టం, మీ సేవ, మీ అంకితభావం ఎప్పటికీ మరువలేనిది." అని గంట రవికుమార్ అన్నారు. రాబోయే వరంగల్ మున్సిపాలిటీ ఎన్నికలు, పార్టీ చేపట్టే ప్రజా ఉద్యమాలు, సేవా కార్యక్రమాల్లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని రవికుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



# ఆస్కీ డైరెక్టర్ జనార్ధన్ రెడ్డిని కలిసిన కమిషనర్

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్మాణ, కూల్చివేత (కన్స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్) వ్యర్థాల నిర్వహణపై నిర్వహించే వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆస్కీ సెంటర్ డైరెక్టర్, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ బీ. జనార్ధన్ రెడ్డిని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి. వెంకన్న మంగళవారం హరిత కాకతీయ హోటల్లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు.

# అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**ములుగు, ఆయుధం:** ములుగు జిల్లా పరిధిలోని తాడ్వాయి ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొదటి విడతలో భర్తీ చేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించబడినవి.. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం https://wdcw.tg.nic.in/ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. జూలై 1 నుంచి 15 వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలి. అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటర్మీడియట్ లేదా 12వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి; గిరిజన ప్రాంతాలలో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్మీడియట్ అర్హత కలిగిన అభ్యర్థులు అందుబాటులో లేని పక్షంలో ఎస్సెస్సీ / 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థుల వయస్సు 01.07.2026 నాటికి 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థి సంబంధిత అంగన్‌వాడీ కేంద్ర పరిధి/గ్రామపంచాయతీకి (రూరల్) చెందిన స్థానికురాలై ఉండాలి. ఎస్టీ సబ్ ప్లాన్ క్రింద ఎస్టీ వర్గానికి కేటాయించిన పోస్టులకు అదే గ్రామం/ఆవాసం నుండి వచ్చిన ఎస్టీ అభ్యర్థులు మాత్రమే అర్హులు; ఎస్సీ సబ్ ప్లాన్ క్రింద ఎస్సీ వర్గానికి కేటాయించిన పోస్టులకు అదే గ్రామ పంచాయతీలోని ఆవాసల నుండి వచ్చిన ఎస్సీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. అభ్యర్థుల ఎంపిక ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్ (70 మార్కులు), ప్రత్యేక కేటగిరీలు అయిన వితంతువులు (5 మార్కులు), అనాథలు (10 మార్కులు), దివ్యాంగులు (5 మార్కులు) మరియు జిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే ఇంటర్వ్యూ (10 మార్కులు) ఆధారంగా జరుగుతుంది. దరఖాస్తు https://wdcw.tg.nic.in/ వెబ్‌సైట్ నందు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తాడ్వాయి శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి తెలిపారు.

# నేరం చేస్తే శిక్ష పడుతుందని నిందితుల్లో భయం కలగాలి

- **వరంగల్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**




**వరంగల్, ఆయుధం:** నేరం చేస్తే కోర్టులో శిక్ష పడుతుందని భయాన్ని నిందితులను కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలియజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితులు పాల్పడిన నేరాలను కోర్టు నిరూపించి నేరస్థులకు శిక్ష పడటంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పాటు దర్యాప్తు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందిస్తూ మంగళవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గత ఏడాది జూలై నుండి నేటి వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 41 కేసుల్లో నిందితులు పాల్పడిన నేరాలకు కోర్టులో శిక్షలు విధించారు. చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన జంట హత్యల కేసులో నిందితుడికి కోర్టు ఉరిశిక్ష విధించింది. వీటితో పాటు యావజ్జీవ కారాగార శిక్షలతో పాటు 20 ఏళ్ల కఠిన శిక్షలు కూడా విధించడం జరిగిందని, ఇన్ని కేసుల్లో నిందితులకు శిక్షలు పడటంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కృషి అభినందనీయమని, దీనితో నేరాలు నిరూపణ జరిగి నిందితులకు శిక్షలు పడటంలో వృద్ధి శాతం ఏడు శాతానికి పెరిగిందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లోను అధికారులు అత్యధిక కేసులను పరిష్కరించారని, ఇదే రీతిలో రాబోవు రోజుల్లో మరిన్ని కేసుల్లో నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని, కేసులను నమోదు, దర్యాప్తు చేయడం మాత్రమే కాదు నిందితులకు శిక్ష పడ్డప్పుడే పోలీసులకు గుర్తింపు వుంటుందని.. శిక్ష పడినప్పుడే నేరాల తగ్గే అవకాశం వుంటుందన్నారు. ప్రధానంగా కేసులు తుది దశ వరకు వచ్చేవరకు, నిందితులకు శిక్షలు ఖరారు అయ్యేందుకు పోలీసులు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని సిపి తెలిపారు. అనంతరం సిపి చేతుల మీదుగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ప్రాసిక్యూషన్ జాయింట్ డైరెక్టర్ రాము, ఏసిపిలు దేవిడ్‌రాజు, సతీష్‌బాబు, సదయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీనివాస్, సంతోషి, రవి కిరణ్, హరిచంద్ర ప్రసాద్, బృందా దేవి, దుర్గాబాయి, రాజమల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవీందర్ రావు, కిరణ్ కుమార్, నీరజ, ఇన్స్‌పెక్టర్లు సంజీవ్ రావు, మల్లయ్యతో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

# పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

**వరంగల్, ఆయుధం:** 2026-27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్‌లో స్పాట్ అడ్మిషన్ల ద్వారా క్రింది కోర్సులలో ఖాళీ సీట్లు అందుబాటులో ఉన్నట్లు ప్రిన్సిపాల్ పి. శ్రీనివాస్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. CRV (Civil Engineering - Real Estate & Valuation) - 21 ఖాళీ సీట్లు, Mechanical Engineering - 34 ఖాళీ సీట్లు ఉన్నాయని చెప్పారు. జూలై 1 నుంచి 3వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈనెల 4న స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రవేశం పొందే అభ్యర్థులు సంస్థ ఫీజు ₹5,080/తో పాటు, పై పేర్కొన్న స్పాట్ అడ్మిషన్ ప్రాసెసింగ్ ఫీజును కూడా నిబంధనల ప్రకారం చెల్లించవలసి ఉంటుందన్నారు.

అభ్యర్థులు ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్ష మార్కుల మెమో, IV నుండి X తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (TC), కుల ధ్రువీకరణ పత్రం (వర్తించినట్లయితే), నివాస ధ్రువీకరణ పత్రం (అవసరమైతే) ఒక సెట్ జిరాక్స్ ప్రతులు, స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా వ్యక్తిగతంగా కళాశాలకు హాజరై, పై పేర్కొన్న ఒరిజినల్ ధ్రువపత్రాలు, అవసరమైన ఫీజులతో హాజరు కావాలని కోరారు.

# పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు ఖరారు



**ఢిల్లీ, ఆయుధం:** చిన్న మొత్తాల పొదుపు పథకాలపై ఇచ్చే వడ్డీరేట్లను కేంద్రప్రభుత్వం ఖరారు చేసింది. వరుసగా తొమ్మిదో త్రైమాసికం (2026 27 జులై సెప్టెంబర్)లోనూ ఎలాంటి మార్పులూ చేయలేదు. 2026 మార్చి 1 నుంచి జూన్ 30 కాలానికి నోటిఫై చేసిన వడ్డీ రేట్లనే, 2026 జులై 1నుంచి సెప్టెంబర్ 30 వరకు అమలు చేయనున్నట్లు ఆర్థిక శాఖ మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రతి త్రైమాసికానికి పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను కేంద్రం నోటిఫై చేస్తుంది. చివరిసారిగా 202324 నాలుగో త్రైమాసికంలో కొన్ని పథకాల వడ్డీ రేట్లను సవరించింది.

**వడ్డీ రేట్లు ఇలా..**

- సుకన్య సమృద్ధి యోజన 8.2%
- మూడేళ్ల టర్మ్ డిపాజిట్ 7.1%
- పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ 7.1%
- కిసాన్ వికాస్ పత్ర 7.5%
- నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ 7.7%
- మంత్లీ సేవింగ్స్ పథకం 7.4%
- పోస్టాఫీసు పొదుపు డిపాజిట్ పథకాలు 4%

# 525 కిలోల గంజాయి పట్టివేత

**భద్రాద్రి కొత్తగూడెం, ఆయుధం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయిని ఈగల్ ఫోర్స్, పోలీసులు పట్టుకున్నారు. బూర్గంపాడు మండలం సారపాక వద్ద కంటైనర్‌లో తరలిస్తున్న 525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.2.62 కోట్లుగా అంచనా వేశారు. కంటైనర్‌లో ప్రత్యేకంగా నిర్మించిన రహస్య గదిలో గంజాయిని ముఠా దాచినట్లు పోలీసులు గుర్తించారు. ఒడిశాలో సేకరించి యూపీకి తరలిస్తున్నట్లు తేల్చారు. ఈ ముఠాలోని బాలుడు సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న నలుగురు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కంటైనర్, బైక్, 5 సెల్‌ఫోన్లు, రూ.10,570 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.




# 'సర్' బాధ్యతాయుతంగా నిర్వహించాలి

- **ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో ఖచ్చితత్వం పాటించాలి**
- **ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి,ఆర్‌డీఓ కృష్ణవేణి**

**ములుగు, ఆయుధం:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఓటరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి కృష్ణవేణి అధికారులకు సూచించారు. మంగళవారం ఎస్ఐఆర్-2026 కార్యక్రమంలో భాగంగా ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి కృష్ణవేణి వెంకటాపూర్ మండలంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 1, 7, 10, 15లను సందర్శించి ప్రత్యేక సవరణ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం కింద ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందజేయడం, వాటిని సక్రమంగా పూరింపజేయించడం, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయడం వంటి అంశాలపై బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల ఆన్‌లైన్ ధృవీకరణ, సమర్పణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదు, ధృవీకరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న రికార్డులు, అవసరమైన ఏర్పాట్లు, సిబ్బంది నిర్వహణను పరిశీలించిన ఆమె, ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో వెంకటాపూర్ మండల తహసీల్దార్ గిరిబాబు, ఎన్నికల విభాగం సిబ్బంది నితీష్, ఆర్ఐ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీటియు నుండి సీఐటీయు లో చేరిక



**వరంగల్, ఆయుధం:** ఏఐసిటియు ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీనియర్ నాయకులు ఎండి మహబూబ్ పాషా వారి కమిటీ సభ్యులైన పలువురు 60 మంది నాయకులు కార్యకర్తలు సీఐటీయూలో చేరారు. మంగళవారం ఉరుసుగుట్ట రోడ్డులో గల రామ సురేందర్ భవన్లో జరిగిన సిఐటియు జిల్లా విస్తృత సమావేశం జిల్లా కోశాధికారి జన్ను ప్రకాష్ అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిలుగా, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం రమేష్ మహబూబ్ పాషా వారి నాయకత్వ నికి సిఐటియు కండువాలు కప్పి సీఐటీయులోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరూరి కుమార్, గడ్డం రమేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా దేశంలో రాష్ట్రంలో ట్రాన్స్పోర్ట్ రంగంపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నదని భారత దేశ వ్యాప్తంగా దేశ ఆర్థిక అభివృద్ధి లో ట్రాన్స్పోర్ట్ రంగం ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తుందని అలాంటి రంగాన్ని పూర్తిగా కార్పోరేట్ కంపెనీల చేతిలో పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని అందుకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి ఆటో డ్రైవర్ కు ఏటా 12,000 అభివృద్ధి కల్పిస్తానని వాగ్దానం చేసి ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. సీఐటీయూలో చేరిన వారిలో ఎండి మహబూబ్ పాషా, ఎస్.కె మదర్, ఎస్.కె.లతీఫ్, రాందేవ్ గాంధీ, జానీ, దేవేందర్, ఎంఏ.సలాం, దస్తగిరి, ఎస్.డి.బాబా, సదానందం, పాష గౌస్, మహబూబ్, అంకుష్, రహమతుల్లా తదితరులు చేరారు.

# వెనెజువెలాలో భారత నావికుడు మృతి..

జాతీయం, ఆయుధం: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రాకేశ్ చౌహాన్ అనే నావికుడు ఇటీవల వెనెజువెలాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతదేహం భారత్‌కు వచ్చాక, అతడి మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో స్థానిక అధికారుల పర్యవేక్షణలో మృతదేహానికి రెండోసారి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టంలో మెదడు, గుండె, ఊపిరితిత్తులు, లివర్, కిడ్నీలు తదితర కీలక అవయవాలు లేనట్లు తేలింది. ఈ విషయాన్ని ఫెడరేషన్ ఆఫ్ సీఫేరర్స్ యూనియన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. దీనిపై వెనెజువెలా అధికారులను సంప్రదిస్తున్నట్లు తెలిపింది.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695